

నెరవేరిన 'ఆశ'
జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ఆశ కార్యకర్తలకు గుర్తింపు లభించింది. జీతం పెరిగింది. భవిష్యత్తులోనూ మంచి జరుగుతుందన్న 'ఆశ' ఉంది.
- 8లో



ఎన్నికల నిర్వహణలో పీఓ, ఏపీఓల పాత్ర కీలకం
- 8లో
ఎన్నికల నిర్వహణలో పీఓ, ఏపీఓ పాత్ర కీలకమని ఆర్డీఓ హేమలత అన్నారు.



ఖాళీ అవుతున్న టీడీపీ..!
ఉమ్మడి విజయనగరం జిల్లా తెలుగుదేశం పార్టీ ఖాళీ అవుతున్న పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి.
- 8లో

న్యూస్‌రీల్

ఈవీఎంల కేటాయింపు

విజయనగరం అర్బన్: వచ్చే ఎన్నికల్లో వినియోగించేందుకు ర్యాండమైజేషన్‌గా ఈవీఎంలను కేటాయించారు. కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ కార్యాలయంలో రాష్ట్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు రామ్మోహన్ మిశ్రా, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి శుక్రవారం ఈ ప్రక్రియను నిర్వహించారు. కంప్యూటర్ ర్యాండమైజేషన్ ద్వారా వివిధ నియోజకవర్గాలకు ఈవీఎంలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎస్పీ ఎం.దీపిక, జేసీ కె.కార్తీక్, డీఆర్వో ఎస్.డి.అనిత, ఈవీఎంల నోడల్ అధికారి బి.ఉమాశంకర్, డీఆర్‌డీఏ పీడీ ఎ.కళ్యాణచక్రవర్తి, రాజకీయ పార్టీల ప్రతినిధులు రొంగలి పోతన్న, ఎం.వి.నర్సింహరాజు, రెడ్డి శంకరరావు, కె.సోములు, ఎం.రవి, ప్రవీణ్‌కుమార్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఎండలతో జాగ్రత్త!

• డీఎంహెచ్ఓ భాస్కరరావు



విజయనగరం ఫోర్ట్: ఎండతీవ్రత ఎక్కువగా ఉందని, అత్యవసర వేళ ఎండలో రాకపోకలు సాగించేవారు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు సూచించారు. స్థానిక విలేకరులతో ఆయన శుక్రవారం మాట్లాడారు. చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు పుట్టడం, మగతగా ఉండడం, కలవరింతలు, ఫిట్స్, పాక్షిక అపస్మారక స్థితి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించి ప్రథమ చికిత్స పొందాలన్నారు. ఎండలో తిరిగేవారు గొడుగు వినియోగించాలని, తెలుపు రంగు చేనేత వస్త్రాలు ధరించాలని సూచించారు. వేడి గాలులు తగలకుండా చూసుకోవాలని చెప్పారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య కాలంలో ఆరుబయట అధిక శారీరక శ్రమతో కూడిన పనిచేయకూడదన్నారు. మంచినీరు ఎక్కువగా తాగాలన్నారు.

నిర్ణీత కాలంలో సేవలందించాలి



వినియోగదారుడి నుంచి వినతిని స్వీకరిస్తున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

విజయనగరం ఫోర్ట్: వినియోగదారులకు నిర్ణీత కాలంలో సేవలందించాలని విద్యుత్ వినియోగదారుల సమస్య పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్మన్ బి.సత్యనారాయణ సూచించారు. నగరంలోని దాసన్నపేట విద్యుత్ భవన్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమస్యలు పరిష్కరానికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్లింగ్‌లో లోపాలు, విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తులు, కాలిపోయిన వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం, మీటర్ల ఏర్పాటు, విద్యుత్ ఓల్టేజ్ హెచ్చుతగ్గులు, విద్యుత్ మీటర్ల లోపాలు సరిచేయడం, కొత్త విద్యుత్ కనెక్షన్లు, అదనపు లోడు మంజూరు, యాజమాని పేరు, కేటగిరీ, ఇతర మార్పిడి, విద్యుత్ వినియోగదారుల బిల్లులో లోపాలు సరిచేయడం వంటి సేవలను సీజీఆర్ఎఫ్ అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ముచ్చల లక్ష్మణరావు, సీజీఆర్ఎఫ్ సభ్యులు శ్రీనివాస్, వి.జనార్దనరావు, సురేంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన



ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను సందర్శించిన పరిశీలకులు మిశ్రా

విజయనగరం అర్బన్: రాష్ట్ర ఎన్నికల సాధారణ పరిశీలకుడు రామ్మోహన్ మిశ్రా జిల్లాలో శుక్రవారం పర్యటించారు. ఆయనకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి స్వాగతం పలికారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు తీసుకున్న చర్యలు, సీజర్ మేనేజ్‌మెంట్, ఎన్నికల శిక్షణ తదితర అంశాలను తన చాంబర్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ వివరించారు. ఇప్పటివరకు జిల్లాలో సుమారు రూ.కోటి 54 లక్షల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు, శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకున్న చర్యలను ఎస్పీ దీపిక వివరించారు. ఇప్పటివరకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు, తనిఖీలకు సంబంధించిన అంశాలను తెలిపారు. ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను మిశ్రా సందర్శించారు. వివిధ విభాగాల పనితీరును, ఇప్పటివరకు అందిన ఫిర్యాదులు, తీసుకున్న చర్యలను కలెక్టర్ వివరించారు. ఎంసీఎంసీ, కంప్లయింట్ సెల్, 24 గంటల కాల్ సెంటర్, సీవిజిల్ తదితర విభాగాల పనితీరుపై మిశ్రా ఆరా తీశారు.

ఇంటర్మీడియట్ ఫలితాల్లో
బాలికలదే హవా

- ఫలితాల్లో జిల్లాకు ఫస్టియర్‌లో - 13, సెకెండ్ ఇంటర్‌లో 21వ స్థానం
- సత్తా చూపిన ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు
- పెరిగిన ఉత్తీర్ణత శాతం
- మే 24 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు



లలితకు స్వీట్లు తినిపిస్తున్న తల్లిదండ్రులు సుశీల, సంగమేష్

విజయనగరం అర్బన్:

ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలు శుక్రవారం వెలువడ్డాయి. ఈ ఏడాది ఫలితాల్లోనూ జిల్లాలో బాలికలే హవాచూపారు. ప్రభుత్వ కళాశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్ విద్యార్థులు మెరిశారు. రాష్ట్రస్థాయిలో జిల్లా ఫస్టియర్ ఫలితాల్లో 13, సెకెండియర్ ఇంటర్‌లో 21వ స్థానంలో నిలిచింది. జిల్లాలో ఫస్టియర్ పరీక్షలు రాసిన 16,584 మంది విద్యార్థుల్లో 62 శాతంతో 10,267 మంది ఉత్తీర్ణులయ్యారు. పరీక్షకు హాజరైన 8,903 మంది బాలికల్లో 6,033 మంది పాసయ్యారు. 68 శాతం ఉత్తీర్ణత నమోదుచేశారు. బాలురలో 7,681 మందిలో 55 శాతంతో 4,234 మంది ఉత్తీర్ణులయ్యారు.



బవిరిశెట్టి అవినాష్, ఎంపీసీ 981, మోడల్ స్కూల్, అక్కివరం

• ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 70 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. పరీక్షకు హాజరైన 15,180 మందిలో 10,591 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 8,387 మందికి 74 శాతంతో 6,214 మంది, బాలురలో 6,793 మందికి 64 శాతంతో 4,377 మంది ఉత్తీర్ణులయ్యారు.

• వృత్తి విద్యా(ఒకేషనల్) కోర్సుల్లో 58 శాతం ఉత్తీర్ణత

వృత్తివిద్యా కోర్సుల్లో ఫస్టియర్ ఇంటర్‌లో 2,909 మంది హాజరుకాగా 58 శాతంతో 1,679 మంది ఉత్తీర్ణులయ్యారు. పరీక్షకు హాజరైన 1,141 మంది బాలురలో 45 శాతంతో 519 మంది, 1,768 మంది బాలికల్లో 66 శాతంతో 1,160 మంది పాసయ్యారు. అలాగే, సెకెండ్ ఇంటర్ పరీక్షలకు 2,693 మంది హాజరుకాగా 68 శాతంతో 1,824 మంది ఉత్తీర్ణులయ్యారు. పరీక్షకు హాజరైన 1,174 మంది బాలురుల్లో 57 శాతంతో 669 మంది, 1,519 మంది బాలికల్లో 76 శాతంతో 1,156 మంది ఉత్తీర్ణులయ్యారు.

• ఇంటర్‌లో మెరిసిన కూలీ బిడ్డ

నెల్లిమర్ల: నెల్లిమర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని బర్ల లలిత ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో బైపీసీ గ్రూపులో 440కు 435 మార్కులు సాధించింది. లలితది జియ్యమ్మవలస మండలంలోని కన్నపుదొరవలస గ్రామం. తల్లి దండ్రులు సుశీల, సంగమేష్ భవన నిర్మాణ కూలీలు. చదువుపై కుమార్తెకు ఉన్న ఆసక్తిని గమనించి కళాశాలలో చేర్పించారు. ఇక్కడే బాలికల వసతిగృహంలో ఉంటూ లలిత చదువుతోంది. కార్పొరేట్ కళాశాల విద్యార్థులను మించి బైపీసీ విభాగంలో అధిక మార్కులు సాధించింది. కుమార్తె చదువులో రాణించడంతో తల్లిదండ్రులు మురిసిపోతున్నారు. విద్యార్థిని ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు అభినందించారు.

• సత్తాచూపిన బాడంగి ప్రభుత్వ కళాశాల విద్యార్థులు

ఇంటర్మీడియట్ సెకెండియర్ ఫలితాల్లో జిల్లాలోని బాడంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 93.62 శాతం ఉత్తీర్ణతతో మొదటి స్థానంలో నిలిచారు. వేపాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల 83.08 శాతం ఉత్తీర్ణతతో రెండో స్థానం, డెంకాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల మూడో స్థానంలో నిలిచాయి. మొదటి సంవత్సర ఫలితాల్లో దత్తిరాజేరు జూనియర్ కళాశాలలో శతశాతం ఉత్తీర్ణతతో మొదటి స్థానం, బాడంగి జూనియర్ కళాశాల 74.51 శాతంతో రెండోస్థానం, వేపాడ జూనియర్ కళాశాల 62 శాతంతో మూడో స్థానంలో నిలిచాయి.

• ప్రతిభ చూపిన విద్యార్థులు



బలగ జయేంద్ర నాయుడు (ఎంపీసీ 465/470)

జిల్లాలో ద్వితీయ ఇంటర్‌లో 1000 మార్కులకు జి.ఇ.ప్రవీణ్ కుమార్, సీహెచ్.పావని, ఆర్.గాయత్రి ఎంపీసీలో 989 మార్కులు, ఎస్.రోషిణి, ఎల్.అరవింద్ ఎంపీసీలో 988 మార్కులు, బైపీసీ విభాగంలో ఎస్.మానస, జి.మణికంఠ- 987, పి.మహాలక్ష్మి-978, సీఈసీలో జి.రమ్య-929, నైనా బచావత్- 928 మార్కులు సాధించారు.
• జిల్లాలో మొదటి సంవత్సర ఇంటర్‌లో ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో 470కు 465 మార్కులు సాధించిన వారిలో బలగ జయేంద్ర నాయుడు, ఎ.కార్తీక్, బి.భాను, బి.పూజ, ఎస్.నిఖిల్, సీహెచ్.గిరీష్ ఉన్నారు. బైపీసీలో 440కు బి.లలిత-435, డి.సత్యసాయికుమారి -432, సీఈసీలో షేక్ ముకుర్తాం 482 మార్కులు సాధించారు.



రేగిడి: కేజీబీవీ బాలికలకు మిఠాయిలు తినిపిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మి

• ఫలితాల్లో 'ఆదర్శ'నీయం

జిల్లాలో ఏపీ మోడల్ స్కూల్/కళాశాలల్లో ప్రథమ సంవత్సర ఇంటర్మీటియట్ ఫలితాల్లో వేపాడ స్కూల్ 90.16 శాతం ఉత్తీర్ణతతో ముందంజలో నిలిచింది. పెరిమాళి స్కూల్ 90.12 శాతం, నెల్లిమర్ల స్కూల్ 87.36 శాతంతో ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచాయి. ద్వితీయ ఇంటర్‌లో 94.90 శాతంతో పెరిమాళి, 94.67 శాతంతో వేపాడ, 93.75 శాతం ఉత్తీర్ణతతో వరుస మూడు స్థానాలను సొంతం చేసుకున్నాయి. మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షరాసిన 879 మందిలో 690 మంది ఉత్తీర్ణులయ్యారు. రెండో సంవత్సర ఇంటర్ పరీక్ష రాసిన 1,006 మందిలో 833 మంది పాసయ్యారు.

• రాణించిన కేజీబీవీ బాలికలు

జిల్లా వ్యాప్తంగా ఉన్న కేజీబీవీ కళాశాల విభాగంలో ప్రథమ సంవత్సర పరీక్ష రాసిన 682 మందిలో 508 మంది బాలికలు ఉత్తీర్ణులయ్యారు. బాడంగి కేజీబీవీలో శతశాతం ఉత్తీర్ణత నమోదుకాగా, 93.94 శాతంతో రెండో స్థానంలో రామభద్రపురం కేజీబీవీ, 90.48 శాతంతో నెల్లిమర్ల మూడో స్థానంలో ఉన్నాయి. ద్వితీయ సంవత్సర పరీక్షలు రాసిన 649 మందిలో 524 మంది ఉత్తీర్ణులయ్యారు. శతశాతం ఉత్తీర్ణత సాధించిన విజయనగరం, బాడంగి కేజీబీవీలు మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. 96.67 శాతంతో ఎల్.కోట కేజీబీవీ మూడో స్థానంలో ఉంది. ఒకేషనల్ కోర్సుల్లో ఆర్.ఆముదాలవలస, వేపాడ, డెంకాడ, దత్తిరాజేరు, జామి కేజీబీవీ బాలికలు శతశాతం ఉత్తీర్ణత సాధించారు.
• ఇంటర్మీడియట్ ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించి వేపాడ, బాడంగి సోషల్ వెల్ఫేర్ కళాశాలలు మొదటి స్థానంలో ఉన్నాయి. 93.75 శాతం ఫలితాల సాధించి నెల్లిమర్ల ఎంజేపీఏపీబీసీ డబ్ల్యూఆర్ కళాశాల మూడో స్థానంలో నిలిచింది.

• మే 24 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి వచ్చే జూన్ 1వ తేదీ వరకు జరుగుతాయని ఆర్ఐఓ మజ్జి ఆదినారాయణ తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ప్రథమ సంవత్సర ఇంటర్, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు ద్వితీయ ఇంటర్ పరీక్షలు జరుగుతాయని చెప్పారు. ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు పరీక్ష ఫీజు స్వీకరణ ప్రక్రియ జరుగుతుందన్నారు. మే 1 నుంచి 4వ తేదీ వరకు రెండు సెషన్లలో ప్రయోగపరీక్షలు జరుగుతాయని తెలిపారు. తక్కువ మార్కుల వచ్చినవారు, ఫెయిలైన విద్యార్థులు ఆత్మస్థైర్యంతో మళ్లీ పరీక్షకు హాజరుకావాలని కోరారు.

సంవత్సరం	పరీక్షకు హాజరైనవారు	ఉత్తీర్ణులు	శాతం	హాజరైన బాలురు	ఉత్తీర్ణులు	శాతం	హాజరైన బాలికలు	ఉత్తీర్ణులు	శాతం
ఫస్టియర్	16,584	10,267	62	7,681	4,234	55	8,903	6,033	68
సెకెండియర్	15,180	10,591	70	6,793	4,377	64	8,387	6,214	74

అర్హులందరికీ ఓటు హక్కు

- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి
- కలెక్టరేట్‌లో సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభించిన కలెక్టర్



కలెక్టరేట్ పోర్టికోవద్ద ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభించిన కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తున్నామని, 18 ఏళ్లు నిండిన వారంతా ఈ నెల 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి కోరారు. మే 13న జరిగే ఎన్నికలకు జిల్లాలో ఏర్పాట్లు వేగవంతం చేశామన్నారు. కలెక్టరేట్ పోర్టికోవద్ద ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్‌ను ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటర్లను చైతన్యపరిచేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. దివ్యాంగులు, హిజ్రాలు, యువత, మహిళలు, పెన్షనర్లు, క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించామని, వారానికి రెండు కార్యక్రమాలు చొప్పున షెడ్యూల్‌ను రూపొందించామని వివరించారు. ఈనెల 18వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఏప్రిల్ 26వ తేదీన నామినేషన్ల స్క్రూటినీ జరుగుతుందని, 29న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. ఇప్పటికే పీఓలు, ఏపీఓలకు శిక్షణ పూర్తయిందని, రెండో విడత శిక్షణకు ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని అమలు చేసేందుకు ప్రత్యేక బృందాలను నియమించామని, క్షేత్ర స్థాయిలో నిఘాను ముమ్మరం చేస్తున్నామని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు జిల్లాలో సుమారు కోటి రూ.54 లక్షలు విలువైన నగదు, మద్యం, వివిధ వస్తువులను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో జేసీ కె.కార్తీక్, స్వీప్ నోడల్ ఆఫీసర్, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌తో అన్ని వర్గాలకు మేలు

- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



సభలో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

చీపురుపల్లి రూరల్ (గరివిడి): రాష్ట్రంలో పేద, మధ్యతరగతి ప్రజలతో పాటు అన్ని వర్గాల వారికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మేలు జరిగిందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. గరివిడి మండలం కోనూరు గ్రామంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో బొత్స మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మనంవేసే ఓటు ఒక నమ్మకాన్ని, ధైర్యాన్ని ఇవ్వాలని, భరోసా కల్పించేలా ఉండాలన్నారు. అలాంటి భరోసా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే ప్రజలకు కలిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలుచేసిన నవరత్న పథకాలతో ప్రతీ ఇంటా వెలుగులు ప్రసరించాయన్నారు. అమ్మఒడి, జగనన్న విద్యాకానుకలు, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, జగనన్న గోరుముద్ద, నాడు-నేడు వంటి పథకాలతో పేదకుటుంబాల చదువుకు భరోసా కలిగిందన్నారు. వైఎస్సార్ రైతు భరోసా కింద రైతన్నలకు ఏటా పెట్టుబడి సాయం ఠంచన్‌గా అందుతోందన్నారు. జిల్లాకు మెడికల్ కళాశాల సాధించుకున్నామన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్‌తో జిల్లా ప్రగతిపథంలో పయనిస్తుందన్నారు. పేదలకు వైద్యభరోసా కల్పిస్తూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ఆర్థిక పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.25లక్షలకు ప్రభుత్వం పెంచిందన్నారు. తోటపల్లి కాలువలను తవ్వించి సాగునీటి సమస్యకు తెరదించామని చెప్పారు. 58 నెలల పాలనలో ఒక్క కోనూరు గ్రామంలోని లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాల కింద రూ.15 కోట్ల నిధులు నేరుగా వారి ఖాతాల్లో జమచేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానిదేనన్నారు. చంద్రబాబు పచ్చి మోసకారి అని, ఎన్నికల వేళ ఆయన చెప్పే అబద్ధాలను నమ్మొద్దన్నారు. రుణాలు మాఫీ చేస్తానంటూ 2014లో అధికారంలోకి వచ్చి రైతులు, డ్వాక్రా మహిళలను మోసం చేశాడన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి జగన్‌మోహన్‌రెడ్డి పాలనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు.
• ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి ఇంటా 'నవరత్న' వికాసం కనిపిస్తోందన్నారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ కోనూరు గ్రామస్తులు వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన మేలును గుర్తుచేసుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా బొత్స సత్యనారాయణను, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ధీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొత్స సందీప్‌బాబు, వైస్ ఎంపీపీ జి.రామకృష్ణరాజు, సర్పంచ్ బూడి శ్రీరాముల నాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, జి.శ్రీరాములనాయుడు పాల్గొన్నారు.

మూడు ఒకట్లు ఒకటే!

పవన్‌కళ్యాణ్ ప్యాకేజీ నాయకుడని తేలిపోయింది.!. ఏళ్ల తరబడి జనసేన జెండా మోసిన వారికి టికెట్లు లేవు.. పొత్తులో భాగంగా ఇచ్చే టికెట్లనూ టీడీపీ నుంచి అప్పటికప్పుడు జనసేనలోకి వచ్చేవారికే కేటాయించారు. ఇంత జరిగినా చంద్రబాబును కిమ్మనిమాట అనడంలేదంటే.. ఆయనవి స్వార్థ రాజకీయాలేనని ఆ పార్టీ వర్గాలే విమర్శిస్తున్నాయి. ప్రతీ ఐదేళ్లకోసారి రాజకీయాన్ని సినిమాగా భావిస్తూ.. చంద్రబాబు డైరెక్షన్‌లో సొమ్ముచేసుకుంటున్నాడని, ఆయనను నమ్మి పార్టీ కోసం ఆహర్నిశలు పనిచేసే వారిని నిలువునా ముంచేస్తున్నాడన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలో టికెట్ల కేటాయింపే నిలువెత్తు నిదర్శనమని పేర్కొంటున్నారు.



- రెండు జిల్లాల్లో జనసేనకు దక్కిన టికెట్ ఒకటే
- దత్తపుత్రుడి పార్టీకి చంద్రబాబు ఝలక్
- మూడు సీట్లు ఇస్తామని ఒకదానితో సరిపెట్టిన వైనం
- జనసేన ముసుగులో పాలకొండ టికెట్‌కు మడత
- బీజేపీలో ప్రవేశించి ఎచ్చెర్ల సీటుకు ఎసరు
- పాలకొండ, ఎచ్చెర్లలో కూటమి అభ్యర్థులుగా టీడీపీ నేతలు
- నెల్లిమర్ల ఒక్కటే జనసేన పార్టీకి దిక్కు
- పవన్‌కళ్యాణ్ మోసం చేశాడంటూ కన్నీరుపెట్టిన పడాల భూదేవి

సాక్షి ప్రతినిధి, విజయనగరం: జనసేన పార్టీకి విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో మూడు సీట్లు ఇస్తామని... తమ పొత్తు సూపర్ హిట్ అంటూ రెండు వేళ్లూ గాలిలో ఊపుతూ... ఒక్కటంటే ఒక్కటే టికెట్ ఇచ్చిన చంద్రబాబు వెన్నుపోటుకు అసలుసిసలైన బ్రాండ్ అంబాసిడర్ అని మరోసారి నిరూపించుకున్నారు! ఇదేదో ప్రత్యర్థుల మాట కాదు కూటమిలోనే మోసపోయి గుండె రగిలిపోతున్నవారి మాట! నెల్లిమర్ల టికెట్ ఒక్కటి మాత్రమే జనసేన జెండా పట్టుకొని తిరుగుతున్న లోకం మాధవికి దక్కింది. ఎచ్చెర్ల టికెట్‌ను గత ఏడాదే టీడీపీ నుంచి బీజేపీలోకి ప్రవేశించిన నడికుదుటి ఈశ్వరరావు దక్కించుకున్నారు. పాలకొండ టికెట్ అయినా అసలుసిసలైన జనసేన నాయకులకు దక్కుతుందనుకుంటే ఆఖరి నిమిషంలో పసుపు కండువా తీసేసి పార్టీలోకి వచ్చిన నిమ్మక జయకృష్ణకు ఇచ్చేసేశారు. ఇలాంటి ప్రయత్నాలే చేసిన మరో టీడీపీ నాయకురాలు పడాల భూదేవి ఆశలపై నీళ్లు జల్లారు. పవన్ కల్యాణ్ మాట ఇచ్చినా చంద్రబాబు గిమ్మిక్కులతో సీటు చేజారిపోవడంతో ఆమె కన్నీరుమున్నీరవుతుంది. ఎలాగైనా అసెంబ్లీలో అడుగుపెట్టి అధ్యక్షా అందామనుకున్న ఆమెకు ఎమ్మెల్యే పదవి అందని ద్రాక్ష అయిపోయింది.

పాలకొండలో పాతనీరే...

టికెట్ ఇచ్చేస్తామంటూ పాలకొండ జనసేన నాయకులను ఊరించి... ఊరించి చివరకు కొత్త గ్లాసులో పాత సారా పోసినట్టుగా టీడీపీ జంప్ జిలానీ జయకృష్ణకు ఎంపికచేయడమే చిత్రం. జనసేనకు పాలకొండలో రెండు శాతం ఓట్లు లేవని, పాలకొండ టికెట్ జనసేన పార్టీకి ఇస్తే ఊరుకునేది లేదని, తేడా వస్తే నిమ్మక జయకృష్ణను ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలోకి దించుతామని టీడీపీ నాయకులు బీరాలు పలికారు. పొత్తులో భాగంగా జనసేన పార్టీ కోటా టికెట్లను 24 నుంచి 21కు కోతవేసిన నేపథ్యంలో పాలకొండ టికెట్ టీడీపీకి రాదని తేలిపోయింది. ఇది గమనించిన పడాల భూదేవి అప్పటివరకూ వేసుకొని తిరిగిన టీడీపీ కండువాను పక్కనపడేసి జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో సాలువా కప్పించుకున్నారు. ఇక్కడో కొసమెరుపు ఉంది. గ్లాస్ గుర్తుతో పోటీచేయడానికి ఉబలాటపడినా ఆమె మాత్రం ముందు జనసేనలో చేరలేదు. ఇదేదో కొంపముంచే వ్యవహారంలా ఉందని జయకృష్ణ హడావుడిగా టీడీపీ కార్యకర్తలను ఫూల్స్ చేస్తూ ఈనెల 1న పిఠాపురం వెళ్లి జనసేన తీర్థం పుచ్చుకున్నారు. ఇక ఉపేక్షిస్తే లాభం లేదని భూదేవి కూడా ఈ నెల 7న అనకాపల్లి వచ్చిన పవన్ కళ్యాణ్‌ను కలిసి ఆమె కూడా జనసేనలో చేరిపోయారు. చివరకు ఈనెల 9న జనసేన అభ్యర్థిగా నిమ్మక జయకృష్ణ పేరు ఖరారైంది. ఎంత ఆశపడిందో కానీ ఈ వార్తతో భూదేవి కంట కన్నీరు జలపాతమైంది. ఆఖరి నిమిషంలోనైనా తనకు బీఫారం ఇవ్వకపోతే ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగుతానని హుంకరిస్తున్నా... అవేవీ వాస్తవమయ్యే పరిస్థితి కనిపించట్లేదు. ఈ తాజా జనసేన నాయకుల తీరుపై ఇన్నాళ్లూ పాలకొండ జనసేన ఇన్‌చార్జిగా జెండా మోసిన నిమ్మల నిబ్రమ్ అగ్గిమీద గుగ్గిలంలా మండిపడుతున్నారు. తనకు సీటు ఇస్తామని తిప్పించుకున్న పవన్ కళ్యాణ్ ఆఖరి నిమిషంలో తాజామాజీ టీడీపీ నాయకుడికి టికెట్ ఇవ్వడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. పాలకొండలో కూటమి అభ్యర్థిని ఓడిచేందుకు అటు భూదేవి, ఇటు నిబ్రమ్ వర్గాలు సన్నద్ధమవుతున్నాయి. పాలకొండ పట్టణంలోని ఓ కళ్యాణమండపంలో గురువారం నిర్వహించిన నాలుగు మండలాల కూటమి నాయకుల సమావేశంలో జయకృష్ణ అభ్యర్థిత్వాన్ని భూదేవి వర్గం వ్యతిరేకించింది. నాలుగు సార్లు ఓడిపోయిన జయకృష్ణకే మళ్లీ టిక్కెట్ ఇచ్చారని, ఈ సారి కూడా ఓడిపోవడం ఖాయమని స్పష్టం చేసింది.



పవన్‌కళ్యాణ్, చంద్రబాబు కలిపి టికెట్ ఇవ్వకుండా మోసం చేశారంటూ కన్నీరు పెడుతున్న పడాల భూదేవి



పాలకొండలో గురువారం సమావేశమైన టీడీపీ, జనసేన కూటమి నాయకులు

క్లుప్తంగా

నిరుపేద యువతి పెళ్లికి ఆర్థిక సహాయం



పెళ్లికుమార్తెకు రూ.50వేల చెక్కును అందజేస్తున్న సంఘం సభ్యులు

విజయనగరం టౌన్: పట్టణానికి చెందిన ఓ నిరుపేద యువతి వివాహానికి జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం శుక్రవారం ఆర్థిక సహాయం అందించింది. ఈ మేరకు పెళ్లికుమార్తె ధరణికి రూ.50వేలు అందజేసినట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు టీవీ.శ్రీనివాస్, కూరెళ్ల సరోజిని తెలిపారు. బ్రాహ్మణ కుటుంబాల సంక్షేమానికి బాధ్యతగా ఆర్థిక సహాయం అందించిన సంస్థ ప్రతినిధులకు వధువు, ఆమె తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కార్యర్శులు సరిపల్లి శ్రీనివాస్, గంటి మోహన్, వంకాయలపాటి శ్రీనివాస్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వీడని గజరాజుల బెడద



పెదమేరంగి కూడలి వద్ద ఉన్న ప్రధాన రహదారిపై ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని రామినాయుడు వలస పొలిమేరలో గజరాజులు మూడు రోజుల నుంచి కదలడం లేదని రైతులు వాపోతున్నారు. జొన్నపంటను పూర్తిగా ధ్వంసం చేయడంతో బాధితులు లబోదిబోమంటున్నారు.10 రోజుల్లో చేతి కందనున్న పంటను ధ్వంసం చేయడంతో రైతుల ఆవేదన వర్ణనాతీతంగా ఉంది. శుక్రవారం మధ్యాహ్న సమయానికి పెదమేరంగి కూడలి వద్ద ఉన్న ప్రధాన రహదారిపైకి ఏనుగులు రావడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. సంబంధిత అటవీ సిబ్బంది వాటిని తరలించే ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు.

గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడిన నిందితులు

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస చెక్ పోస్టు వద్ద ఇద్దరు యువకుల దగ్గర నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నారాయణరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక బృందాలతో కోనవలస చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా కేరళ రాష్ట్రానికి చెందిన శిబిన్ జోసెఫ్, మితలేజ్‌ల కాలేజ్ బ్యాగుల్లో 4.2 గ్రాముల గంజాయిని గుర్తించామన్నారు. గంజాయి విలువ సుమారు రూ.21 వేలు ఉంటుందని, నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేశామని చెప్పారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



అధికారి వెంకటేష్ మృతదేహం

పార్వతీపురం టౌన్/కొమరాడ: కొమరాడ మండలంలోని మాదలింగి గ్రామంలో ఓ వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై పార్వతీపురం జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాదలింగి గ్రామానికి చెందిన అధికారి వెంకటేష్(32) మద్యం తాగి ఇంటికి వచ్చాడని కుటుంబసభ్యులు మందలించడంలో మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగేశాడు. ఈ విషయం గమనించిన భార్య, కుటుంబ సభ్యులు కురుపాం ఆస్పత్రికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించినట్లు వైద్యాధికారులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹135	₹240	₹250

నెరవేరిన ఆశ

- మెరుగుపడిన జీవితం
- ప్రతి నెల రూ.10 వేల గౌరవ వేతనం, సమాజంలో గౌరవం
- జగనన్న ప్రభుత్వం రాకతో మారిన బతుకు
- జిల్లావ్యాప్తంగా 1,785 కుటుంబాల్లో వెలుగులు



ఓ కార్యక్రమంలో ఆనందంగా పాల్గొన్న ఆశ కార్యకర్తలు (ఫైల్)

రాజాం: గతంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం హయాంలో ఆశ కార్యకర్తలంటే చిన్నచూపు ఉండేది. గ్రామాల్లో హెల్త్ సెంటర్లు లేక, వైద్య సిబ్బంది స్థానికంగా ఉండలేని పరిస్థితుల్లో ఆశ కార్యకర్తలే వైద్యానికి పెద్దదిక్కుగా ఉండేవారు. ఏ గ్రామంలో విషజ్వరాలు వచ్చినా ముందు బాధ్యత తీసుకునేది ఆశ కార్యకర్తలే. చిన్నారులు, గర్భిణులకు టీకాల నుంచి ప్రతి ఇంటికి ఫీవర్ సర్వే చేసిన ఆశ కార్యకర్తలకు ప్రతి నెలా కనీసం రూ.2 వేలు గౌరవ వేతనం చెల్లించలేని స్థితిలో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం కాలం నెట్టుకొచ్చింది. ఒత్తిడి పెరిగి కనీస వేతనం, గౌరవం లేక జిల్లాలోని ఆశ కార్యకర్తలు ఒక్కొక్కరు సేవల నుంచి స్వచ్ఛందంగా వైదొలిగేవారు.

ఇప్పుడు..

ఆశ కార్యకర్తల ఉద్యోగానికి డిమాండ్ పెరిగింది. ప్రతి ఆశ కార్యకర్తకు వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిననాటి నుంచి నెలకు రూ.10 వేలు గౌరవ వేతనం చెల్లిస్తోంది. ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు వెలిశాయి. అక్కడ ఆశ కార్యకర్తలు ఉండేందుకు మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. పనిభారం తగ్గించడంతో పాటు ఆశ కార్యకర్తలకు విలువైన వైద్య సేవలు అప్పగించారు. కోవిడ్ సమయంలో ఆశ కార్యకర్తలు ప్రతి గ్రామంలో ప్రజలను ఆదుకున్నారు. సేవలకు తగిన వేతనంతో పాటు గ్రామాల్లో గౌరవం దక్కడంతో ఇప్పుడు ఆశ కార్యకర్తగా చేరి, సేవలు అందించేందుకు పోటీ ఏర్పడుతోంది. కొత్త ఆశ కార్యకర్తలను భర్తీచేసే సమయంలో ఇంటర్మీడియట్, డిగ్రీ చదివే అభ్యర్థులు కూడా ముందుకు వస్తున్నారు. ఆశ కార్యకర్తలకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కల్పించిన గౌరవం ప్రస్తుతం స్పష్టంగా కనిపిస్తోంది.

కార్యకర్తల కుటుంబాల్లో వెలుగులు

పదోతరగతి చదివి ఏ ఉద్యోగం లేక ఆశ కార్యకర్తలుగా చాలా గ్రామాల్లోని మహిళలు విధుల్లో చేరేవారు. వారికి నెలకు పనికి తగిన విధంగా రూ.1000 నుంచి రూ. 2 వేలు గౌరవ వేతనం వచ్చేది. అది కూడా ఏ ఆరు నెలలకో..ఏడాదికో అందేది. చిన్నారులకు టీకాలు వేసే కార్యక్రమం దగ్గర నుంచి గర్భిణులను ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు డెలివరీకి తరలించే పనివరకూ ప్రతి కార్యక్రమం ఆశ కార్యకర్తలమీదే ఉండేది. పనికి తగిన వేతనం లేక, రాజకీయ ఒత్తిళ్లు అధికమవడంతో జిల్లాలో చాలామంది ఆశా కార్యకర్తలు రిజైన్ చేసి ఇంటిపట్టునే ఉండేవారు. సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశ కార్యకర్తల కష్టాలు గుర్తించారు. ప్రతి నెల రూ. 10 వేల గౌరవ వేతనాన్ని ప్రకటిస్తూ జీఓ విడుదలచేశారు. ఈ నిర్ణయంతో ఆశ కార్యకర్తల జీవితాల్లో కొత్త వెలుగులు వచ్చాయి. జిల్లావ్యాప్తంగా ఈ ఉద్యోగాలకు డిమాండ్ పెరిగింది. ఖాళీగా ఉన్న స్థానాలు సైతం భర్తీ అయ్యాయి. సీఎం నిర్ణయంతో జిల్లాలోని 1785 మంది ఆశ కార్యకర్తలకు ప్రతి నెల రూ.10 వేల గౌరవ వేతనం అందుతోంది. అంతేకాకుండా వారిపై రాజకీయ ఒత్తిళ్లు కూడా తొలగాయి. ప్రస్తుతం జిల్లాలోని ఆశ కార్యకర్తల కుటుంబాలు ఆర్థికంగా స్థిరపడి కొత్త జీవితాన్ని కొనసాగిస్తున్నాయి.

నేడు వైఎస్సార్‌సీపీ మహిళా ర్యాలీ



మహిళా ర్యాలీని విజయవంతం చేయాలంటూ విజయ చిహ్నం చూపిస్తున్న నగర మేయర్, డిప్యూటీ మేయర్‌లు

- విజయనగరంలో 6000 మందితో ప్రచారం
- కార్పొరేషన్ మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రావణి

విజయనగరం: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున విజయనగరం శాసనసభ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బెల్లాన చంద్రశేఖర్‌లకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో శనివారం విజయనగరంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ మేయర్ వి.విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణిలు వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నగరంలో గతంలో ఎన్నడూ లేని విధంగా నిర్వహించ తలపెట్టిన ర్యాలీలో నియోజకవర్గంలోని మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం 5 గంటలకు నగరంలోని సీఎంఆర్ జంక్షన్ నుంచి కోట జంక్షన్ వరకు 6000 మంది మహిళలతో ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన యువభేరి, సీనియర్ సిటిజన్స్ సమ్మేళనం విజయవంతం కావడంతో మరింత ఉత్సాహంతో మహిళా ర్యాలీని చేపడుతున్నట్లు వివరించారు. సీఎంఆర్ జంక్షన్ వద్ద ప్రారంభమయ్యే ర్యాలీ ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ జంక్షన్, దాబా గార్డెన్స్, కన్యకాపరమేశ్వరి కోవెల, గంటస్తంభం, మూడులాంతర్లు మీదుగా కోట జంక్షన్ వరకు సాగుతుందన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ నిర్మల, వివిధ డివిజన్‌ల కార్పొరేటర్‌లు పిన్నింటి కళావతి, ఆశపు సుజాత, రేగాన రూపాదేవి, ఆల్తి సత్యకుమారి, పట్టా ఆదిలక్ష్మి, దుప్పాడ సునీత, దాసరి సత్యవతి, బొద్దూరు గోవిందమ్మ, నాయిన పద్మలతో పాటు వివిద డివిజన్‌ల మహిళా ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ఈవీఎం గొడౌన్ల పరిశీలన



ఈవీఎం గోదాములను పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురంటౌన్: గోదాముల్లో భద్రపరిచిన ఈవీఎంలను జాయింట్ కలెక్టర్ శోభికతో కలిసి పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈసీఐ నిబంధనలకు అనుగుణంగా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ప్రతి మూడు నెలలకోసారి ఈవీఎంలను పరిశీస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ రెవెన్యూ అధికారి జి.శివకేశవనాయుడు, ఇతర అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో పీఓ, ఏపీఓల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ హేమలత

- ఆర్డీఓ హేమలత

పార్వతీపురం టౌన్: ఎన్నికల నిర్వహణలో పీఓ, ఏపీఓ కీలక పాత్ర, విధులు అత్యంత ప్రతిష్టాత్మకమని ఆర్డీఓ, పార్వతీపురం ఎన్నికల అధికారి హేమలత అన్నారు. పీఓగా విధులు నిర్వహించడం గొప్ప అవకాశమని పేర్కొన్నారు. ఒక్క తప్పు కూడా జరగకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ, విధులు, ఈవీఎంలు, వీవీప్యాట్లు పనితీరుపై పీఓలు, ఏపీఓలు సంపూర్ణ అవగాహన కలిగిఉండాలని సూచించారు. ఈ మేరకు శనివారం ఆర్డీఓ కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పార్వతీపురం నియోజకవర్గం సంబంధిత ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో పీఓల పాత్ర అత్యంత కీలకమని, పోలింగ్ రోజున, సంబంధిత పోలింగ్ బూత్‌లో పీఓదే పూర్తి అధికారమని చెప్పారు. అందరి విధులపైనా పీఓలకు అవగాహన ఉండాలని సూచించారు. రీ పోలింగ్‌కు ఎక్కడా అవకాశం ఇవ్వకూడదని, ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పులు, పొరపాట్లు జరగకూడదని స్పష్టం చేశారు. ప్రతి చోటా పోలింగ్‌కు 90 నిమిషాల ముందే తప్పనిసరిగా మాక్‌పోల్ నిర్వహించాలని చెప్పారు. మాక్‌పోల్ అనంతరం ఈవీఎంలు డిలీట్ చేయాలని, వీవీప్యాట్లు ఖాళీ చేసి సీల్ చేయాలని సూచించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం



పట్టుబడ్డ మద్యం సీసాలతో ఎస్‌ఐ సూర్యకుమారి

భోగాపురం: మండలంలోని మహారాజుపేట గ్రామ పరిధిలో శుక్రవారం సాయంత్రం పాన్ షాపు నిర్వహిస్తూ అక్రమంగా మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న అక్రమానీ అప్పయ్యమ్మ అనే మహిళను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ సూర్యకుమారి తెలిపారు. ఆమె నుంచి 25 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

గాయత్రి, శ్రీ గాయత్రి విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న గాయత్రి కళాశాల ప్రిన్సిపాల్ మురళి, యాజమాన్యం



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న శ్రీ గాయత్రి కాలేజీ కరస్పాండెంట్ జగదీశ్వరి

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామంలో గల గాయత్రి, శ్రీ గాయత్రి జూనియర్ కళాశాలల విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. గాయత్రి జూనియర్ కళాశాలకు సంబంధించి ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో గురాన కృష్ణ, కిలారి నీలిమ, నడూపూరి రవీంద్రలు 984 మార్కులు, బైపీసీలో ఆల్తి దివ్య 974, వాకాడ సౌమ్య 963 మార్కులు సాధించారు. ప్రథమ సంత్సరం ఎంపీసీలో బాలి సింధు, ముక్కా మణి, ఆవాల సాయిలు 461 చొప్పున మార్కులు, బైపీసీలో డి.దుర్గాప్రసాద్ 430, రొంగలి సింధూజ 429 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ బి.మురళితెలిపారు. శ్రీ గాయత్రి కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో లెంక అరవింద్ 988, బైపీసీలో డి.హేమలత 974 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ఆర్.ఆశ 463, బైపీసీలో కె.నిహారిక 422 మార్కులు సాధించినట్లు కళాశాల డైరెక్టర్ జి.ఎరుకునాయుడు తెలిపారు.

ఖాళీ అవుతున్న టీడీపీ..!

- వైఎస్సార్‌సీపీలోకి ఉమ్మడి జిల్లాలో భారీగా వలసలు



పార్వతీపురం టౌన్: ఎమ్మెల్యే జోగారావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కుటుంబాలు

పార్వతీపురంటౌన్: ఉమ్మడి విజయనగరం జిల్లా తెలుగుదేశం పార్టీ ఖాళీ అవుతున్న పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రతిరోజూ ఉమ్మడి జిల్లాలోని ఏదో ఒక ప్రాంతంలో టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి అధికార వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. ఈ క్రమంలో పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రెండోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ టిక్కెట్ పొందిన ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు అండగా నిలిచేందుకు ప్రతిపక్ష టీడీపీ నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం పార్వతీపురం మండలంలోని రావికోన పంచాయతీలోని అడ్డూరువలస సచివాలయం కన్వీనర్ రామకృష్ణ ఆధ్వర్యంలో 55 కుటుంబాలు ఎమ్మెల్యే జోగారావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఈ సందర్భంగా వారందరికీ ఎమ్మెల్యే జోగారావు పార్టీలోకి సాదరంగా ఆహ్వానం పలుకుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గెలుపు కోసం కలిసికట్టుగా కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్వతీపురం నియోజకవర్గం నుంచి భారీ ఆధిక్యాన్ని జగనన్నకు బహుమతిగా అందజేసేందుకు ప్రతి ఒక్క కార్యకర్త కలిసికట్టుగా పనిచేయాలని కోరారు.

వెల్దూరులో 75 కుటుంబాల చేరిక..

పూసపాటిరేగ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల చేసిన పరిపాలనకు ఆకర్షితులై పూసపాటిరేగ మండలంలోని వెల్దూరు, కిలుగుపేట, కాలపురెడ్డిపేట గ్రామాలకు చెందిన 75 కుటుంబాల వారు టీడీపీని వీడి నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సమక్షంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీ నాయకుడు బోయ సూరిబాబుతో సహా పార్టీలో చేరిన 75 కుటుంబాల వారికి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పార్టీ నాయకులు పతివాడ అప్పలనాయుడు, దారపు గున్నారెడ్డిలు కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేస్తామని పార్టీలో చేరిన వారందరూ ముక్తకంఠంతో తెలియచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అప్పలనాయుడు మాట్లాడుతూ నెల్లిమర్ల నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిస్థాయిలో జరిగాయని, ఏ గ్రామంలో చూసినా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కనపడుతున్నాయన్నారు. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి రెండవసారి ప్రమాణస్వీకారం చేసిన తరువాత అరకొరగా మిగిలిన పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు మంచి జరిగిందంటేనే ఓటేయండని అడిగిన దమ్మున్న నాయికుడు జగన్‌మోహన్‌రెడ్డి అని స్పష్టం చేశారు. ఎంపీ, ఎమ్మెల్యేకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసురావు, మహంతి జనార్దనరావు, దారపు అప్పలసూర్రెడ్డి, అల్లాడ రమేష్, ఎన్.సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో 20 కుటుంబాలు

విజయనగరం: విజయనగరం నియోజకవర్గం పరిధిలో ప్రతిపక్ష టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, స్థానికంగా ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులవుతున్న పలువురు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని శాంతినగర్‌కు చెందిన గుండు ఉమామహేశ్వర రావుతో పాటు ఆయన అనుచరులు 20 కుటుంబాల వారు టీడీపీకి గుడ్‌బై చెప్పి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టివీరవెంకట రాజేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, కార్పొరేటర్ కంటుభుక్త తవిటిరాజులు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో అజీజ్, ఎస్‌కె మున్నా, అబ్దుల్లా, ఆతం చిన్న తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: వైఎస్సార్‌సీపీలో చేరిన వారిని ఆహ్వానించిన ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పతివాడ అప్పలనాయుడు తదితరులు



విజయనగరం: టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో రాజేష్, వేణు, తవిటిరాజులు

బైక్‌ను బస్సు ఢీకొని..

- వేపాడ మండల యువకుడి మృతి
- విశాఖలో జరిగిన ప్రమాదం



రాజ్‌కుమార్ (ఫైల్)

వేపాడ: మండలంలోని పెదకృష్ణరాజపురం గ్రామానికి చెందిన బి.రాజ్‌కుమార్ (30) విశాఖలో బస్సు ఢీ కొన్న ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రమాదంపై స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖలోని ఆస్పత్రికి వైద్యం నిమిత్తం రాజ్‌కుమార్ ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. ఈ క్రమంలో విశాఖలోని రామా టాకీస్ సమీపంలో ట్రావెల్స్ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టడంతో రాజ్‌కుమార్ రోడ్డుపై పడిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి అప్పారావు బొద్దాంలోని చర్చిలో పాస్టర్‌గా ఉన్నారు. తల్లి లక్ష్మి గృహిణి. రాజ్‌కుమార్ డిగ్రీ పూర్తి చేసి కేరళలో పాస్టర్ ట్రైనింగ్ అవుతున్నాడని ఈ మధ్యనే గ్రామానికి వచ్చినట్లు స్థానికులు చెప్పారు.